‘‘సూసినవురా ఆడి పొగరు? ఆ పొగరు నువ్వు అనిసీయాల! ఆడి దగ్గిరోడిన డొబ్బులను నువ్వే కక్కించాల! ఆడి పుంజుక్కట్టిన కత్తినుంచి ఒడుపుగా తప్పించుకొని గెలవాల!’’ అంటూ, డేగతో చెబుతూనే ఇంటికి చేరుకున్నాడు పడమటయ్య.

పొద్దుగుంకే వరకూ డేగ ఆలనాపాలనా చూసుకుంటూ, పందేనికి సిద్ధంచేస్తూ గడిపాడు. చీకటిపడ్డాక దాన్ని కోళ్ల గంపకింద మూసి, ఏదో తిన్నాననిపించి తన గదిలోకెళ్లి నిద్రకు ఉపక్రమించాడు. ఎంత ప్రయత్నించినా నిద్రరాలేదు.

‘పందెమేమవుద్దో.. డేగకేమవుతుందో!’.. ఇవే ఆలోచనలు! అర్ధరాత్రి తర్వాత గాఢంగా నిద్రపట్టేసింది.

* * *

పొద్దుపొడిచాక దిగ్గునలేచాడు పడమటయ్య.

‘ఇదేటి సిత్రం! ఏటీ మొద్దునిద్ర! సీకటితోటే నిద్రలేపేసే డేగకీ నిద్రట్టేసిందా?’ అనుకుంటూ వరండాలో కెళ్లి, గంపెత్తాడు. గంప కింద డేగలేదు. పడమటయ్య గుండె ఆగినంతపనైంది. కంగారుగా పెరట్లోనూ, ఆ పక్కింటోళ్ల కోడిపెట్టల దగ్గర వెతికాడు. ఎక్కడా కనిపించలేదు. పిచ్చోడిలా ఊరంతా వెతుకుతూ.. ‘దా.. దా..’ అని పిలుస్తూనే ఉన్నాడు.

‘‘నా పుంజేమన్నా అగుపించిందా?’’ అని కనిపించిన వారినల్లా అడుగుతూనే ఉన్నాడు.

బారెడు పొద్దెక్కాక నిరాశగా ఇంటికి చేరుకుని, విచారంగా మంచమ్మీద కూలబడ్డాడు.

‘డేగెలాగ మాయిమైపోనది? ఒకేల ఆ సూరిబాబుగోడు దొంగతనంగొచ్చి అట్టుకుపోనడా?’ అని అనుమానిస్తుండగా దుర్గయ్య వచ్చాడు.

‘‘ఏట్రా.. పుంజు అగుపడ్డంనేదని ఎతుకుతున్నవంట. ఏటైంది?’’ అంటూ పరామర్శించాడు.

‘‘ఏటి సెప్పమంటవురా! తెల్లారిలేసి సూత్తే డేగనేదు’’ అని.. తన అనుమానాన్ని వెలిబుచ్చాడు.

‘‘ఆడైయుండడు, ఆడికాడే బోల్డు పుంజులు! ఇదెవడో దొంగనాయాల కోడిపందేలాడీడానికి ఎత్తికెల్లుంటడు. పందేలప్పుడు ఇట్టాంటివి జెరుగుతుంటయి, కనిపెట్టుకునుండాల! బేగెల్లి బరిదెగ్గిర ఎతుకు... దొరికితే దొరకొచ్చు’’.

అతనలా చెప్పడమే ఆలస్యం దిగ్గునలేచి బయల్దేరాడు పడమటయ్య. ఊరికి దూరంగా గుబురు చెట్ల మధ్య నున్న ఖాళీ ప్రదేశంలో జరుగుతున్న కోడిపందేల దగ్గరికి ఆయాసపడుతూ చేరుకున్నాడు. అప్పటికే అక్కడ కోడి పుంజులమధ్య సంక్రాంతి సంకుల సమరం మహాజోరుగా సాగుతున్నది. మరోపక్క గుండాటలూ జరుగుతున్నాయి. పందెంరాయుళ్ల మధ్య డబ్బు వేలల్లో చేతులు మారుతున్నది. అక్కడి కోలాహలం, సందడి మధ్య పడమటయ్య తన డేగను వెతకడం మొదలెట్టాడు. తుప్పలకు, కొమ్మలకు కట్టేసి ఉంచిన కోడిపుంజులలో తన డేగ ఉందేమోనని గాలిస్తున్నాడు. యేడాదిపాటు తనుపడ్డ శ్రమంతా వృథా అయిందని ఆక్రోశిస్తున్నాడు. కోడిపందేలాడుతున్న సూరిబాబు పడమటయ్యను చూసి..

‘‘ఒరే ముసలినక్క! ఏదిరా నీ పుంజు? ఓడిపోతానన్న బయంతో పుంజు అగుపించనేదని నాటకాలడుతున్నవంట’’ అన్నాడు పళ్లికిలిస్తూ.

పడమటయ్య ఏమీ బదులు చెప్పలేదు. ఇంకా అక్కడే ఉంటే అందరూ తనను లోకువచేసి మాట్లాడతారని అక్కణ్నుంచి బయల్దేరాడు. అతనికి సూరిబాబును దెబ్బకుదెబ్బ తీయలేకపోతున్నందుకు కోపంగా ఉంది. ఓడిపోయిన డబ్బు తిరిగి గెల్చే అవకాశం లేనందుకు దిగులుగా ఉంది. తన డేగ ఏమయ్యిందోనని బాధగా ఉంది. అడుగులో అడుగేస్తూ విచారంగా నడుస్తున్నాడు. అంతలో ‘కొక్కొరోకో’ అన్న కూత వినిపించింది. నడకాపి వెనక్కి తిరిగి చూశాడు. ఆశ్చర్యంగా రెక్కలు టపటపలాడిస్తూ పరుగెత్తుకొచ్చి అతని చేతుల్లో వాలిపోయింది డేగ! దాన్ని చూడగానే అతని దిగులెగిరిపోయి, హృదయం ఉప్పొంగిపోయింది. దాని కాలుకు వేలాడుతున్న తాడును చూసి..

‘‘అదునుసూసి నిన్ను బరిలో దించీడానికి దొంగోడు డొంకలో కట్టేత్తే ఇడిపించుకునొచ్చేసినవా? నానంతే నీకెంత పేమ!’’ అంటూ డేగను ఆప్యాయంగా నిమిరాడు. అదేమన్నా తిన్నాదో లేదోనని ఇంటికి తీస్కెళ్లి కాసిన్ని గంట్లు తినిపించాడు. డేగను పందేనికి తీస్కెళ్లడానికి పడమటయ్యకు మనసొప్పడం లేదు. కానీ, సూరిబాబు మాటలు పుండుమీద కారంలా సల్లుతుంటే మనసు చంపుకొని దాన్ని పందేనికి సిద్ధంచేశాడు. కాసిన్ని గంజినీళ్లు తాగి, పందెం డబ్బును, డేగను పట్టుకుని బరి దగ్గరికెళ్లాడు.

సూరిబాబు పడమటయ్య చేతిలోని డేగను చూసి..

‘‘నాటకాలు కట్టేసి నీ పుంజును అట్టుకొచ్చేసినావన్నమాట. ఇంకేటాలిస్యెం? నీ డేగను సికెను పలావు వొండించీడానికి నా నెమలి, సేతువ, కౌజు సిద్ధంగున్నయి. దేనితో పందెమేత్తవో ఎయ్యిరా!’’ అన్నాడు.

‘‘తెగ మిడిసిపడతన్నవు. కట్టెవొంకర పొయ్యి తీరిసినట్టు నీ పొగర్ను నా డేగ తీరుస్తది! ఈ ముసలోడి తడాక ఏటో సూపిత్తది! ఏ పుంజును పందేనికి ఎడతవో ఎట్టుకో!’’ రోషంగా అన్నాడు పడమటయ్య.

‘‘అబ్బో... పవురుసం తన్నుకొచ్చేసిందే... మరి పందెమెంత ఏద్దమేటి!’’.

‘‘ఆ రోజేదో మాయికమ్మేసి నీతో పందేనికి దిగానుగానీ, నేనొకడి సొమ్ముకు ఆసపడేవోణ్ని గాదు. నీ దెగ్గిర రెండుతూర్లు పందేమేసి ఆరేలు పోగొట్టుకున్నను. అయి తిరిగొస్తే సాలు!’’.

ఇద్దరి మధ్య పందెం కుదిరింది. కత్తి కట్టేవాడు మూడొందలు తీసుకుని డేగ కుడికాలుకు కాటన్ గుడ్డ చుట్టి, దానిమీద కత్తిపెట్టి తాడుతో కడుతుంటే పడమటయ్య బాధగా మూలిగాడు.

సూరిబాబు తెల్ల ఈకల సేతువతో బరిలోకొచ్చాడు. పడమటయ్య గుండెరాయి చేసుకుని తన



**‘నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం’ సంయుక్తంగా నిర్వహించిన ‘కథల పోటీ-2023/24’లో తృతీయ బహుమతి రూ.10 వేలు పొందిన కథ.**